# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **మిరప ధరల స్థిరీకరణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**2.** **తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు శంకుస్థాపన చేయనున్నారు.**

**3.** **కేంద్ర బడ్జెట్‌పై విజయవాడలో జరిగే సమావేశంలో పెట్రోలియంశాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరి ఈరోజు పాల్గొంటారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.**

**5.** **అమ్మ భాష పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

మిరప ధరల స్థిరీకరణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది మిర్చి ధరలు పడిపోయాయని అన్నారు. మిరప ఎగుమతులపై కేంద్రమంత్రి దృష్టికి తెచ్చామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 34 సెకన్లు

అలాగే పోలవరం ప్రాజెక్టు గురించి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామన్నారు. 2027లోపు ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ అమలుకు కొత్తగా సమగ్ర నివేదికను రూపొందించి నిధులు వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి వివరించారు.

---

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు శంకుస్థాపన చేయనున్నారు. నారాయణపేట జిల్లా అప్పకపల్లెలో తొలివిడతలో మంజూరు చేసిన ఇళ్లకు ముఖ్యమంత్రి భూమి పూజ చేస్తారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని

ఎంపిక చేసిన గ్రామాల్లో పనులను అధికారులు ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో మండలానికి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి మొత్తం 72 వేల 45 ఇళ్లను నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఈ పథకాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలలో మాత్రమే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

---------------------------

భారతీయ జనతా పార్టీకి చెందిన రాష్ట్ర విభాగం కేంద్ర బడ్జెట్‌పై ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ వార్షిక బడ్జెట్‌లో ప్రజల ప్రయోజనార్థం తీసుకు వచ్చిన కొత్త పథకాలు, పలు కీలక అంశాలపై ప్రజలకు తెలియజేసేందుకు కేంద్ర మంత్రులు పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రసంగిస్తున్నారు ఇందులో భాగంగా ఈ రోజు విజయవాడలో జరిగే సమావేశంలో కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరి పాల్గొంటారు.

ఇది ఇలా ఉండగా దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్దే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిన్న కేంద్ర బడ్జెట్ పై మేధావుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, మధ్యతరగతి ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో ఏడాదికి 12 లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను నుండి మినహాయింపు ఇచ్చారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని అన్నారు. ముఖ్యంగా పోలవరం, అమరావతిల నిర్మాణానికి నిధులు కేటాయించారని చెప్పారు.

---------------------------

ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణస్వీకార కార్యక్రమం ముగిసిన తర్వాత ఎన్డీయే పక్షాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జె.పి నడ్డా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్‌లతో ప్రధానమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశం అనంతరం పవన్ కళ్యాణ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ప్రధానమంత్రి హామీ ఇచ్చారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని... అన్ని హామీలను నెరవేరుస్తామని తెలిపారు.

---------------------------

విజయవాడలోని రాజ్ భవన్ లో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... అరుణాచల్ ప్రదేశ్ ఉదయించే సూర్యుని భూమి అని అన్నారు. ఈ రాష్ట్రం ప్రపంచంలోని అత్యంత అద్భుతమైన బహుభాషా గిరిజన ప్రాంతాలలో ఒకటిగా గుర్తించబడిందని పేర్కొన్నారు. మిజోరాం 1986లో పూర్తి స్థాయి రాష్ట్రంగా అవతరించి 1987 ఫిబ్రవరి 20న రాష్ట్ర హోదాను పొందిందని తెలిపారు. మిజోరాం ప్రజలు సంప్రదాయ విలువలను, ఆచారాలను కొనసాగించడానికి ప్రాధాన్యమిస్తారని గవర్నర్ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు 8 లక్షల మంది దివ్యాంగులకు సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకూ 50 శాతం సర్వే పూర్తయిందని, మార్చి 15 వాటికి ఈ సర్వే పూర్తవుతుందని మంత్రి వివరిస్తూ

వాయిస్ ...28 సెకన్లు

---------------------------

అమ్మ భాష పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి ఏటా ఫిబ్రవరి 21వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక వ్యవహారాల సంస్థ.. యునెస్కో 1999వ సంవత్సరంలో నిర్వహించిన 30వ సాధారణ మహాసభ.. మాతృ భాషా దినోత్సవ తేదీని నిర్ణయించింది. ప్రపంచంలో చిన్నా, పెద్దా భాషలన్నింటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే.. మనం మన జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో సూచించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి 4 లక్షల 50 వేల ఎకరాలకు సాగు నీరు, 25 లక్షల మందికి త్రాగు నీరు అందిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వెలిగొండ ప్రాజక్టు పనులను పూర్తి చేయకుండానే గత ప్రభుత్వం జాతికి అంకితం చేసిందన్నారు. మొదటి, రెండవ సొరంగం పనులు, ఫీడర్ కెనాల్, నిర్వాశితుల కాలనీల నిర్మాణ పనులు పూర్తి కావాల్సిఉందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

కృష్ణా జలాల తరలింపుపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కృష్ణానదీ యాజమాన్య బోర్డుకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన ఈ రోజు మధ్యాహ్నం బోర్డు సమావేశం కానుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటిని ఆంధ్రప్రదేశ్ తరలిస్తోందని, వెంటనే ఆపాలని మంత్రి ఉత్తమ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిధిలో 35 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై కూడా ప్రధానంగా చర్చ జరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఐసీసీ క్రికెట్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా నిన్న దుబాయ్ వేదికగా భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య నిన్న తొలి మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టు 49.4 ఓవర్లలో 228 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన భారత జట్టు 46.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. దీంతో ఈ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి భద్రత కల్పించే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. విజయవాడలోని రాజ్ భవన్ లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసి భద్రతా అంశంపై ఫిర్యాదు చేశారు. అనంతరం బొత్స సత్యనారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డికి జెడ్ ఫస్ల్ భద్రత ఉంటుందని ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడ భద్రత కల్పించాలన్నారు. కానీ గుంటూరు పర్యటనలో కనీస ఏర్పాట్లను ప్రభుత్వం కల్పించలేదని విమర్శించారు.

======================